సాక్షి ఆదిలాబాద్

శనివారం । 13 । మే । 2023



ట్రిపుల్‌ఐటీ పిలుస్తోంది!
'పది'లో ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులు బాసర ట్రిపుల్‌ఐటీలో చేరేందుకు కసరత్తు చేస్తున్నారు. త్వరలోనే 1500 సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కానుంది. IIలో▸



జేపీఎస్ సోని మృతికి నివాళి
జూనియర్ పంచాయతీ కార్యదర్శి భైరిసోని ఆత్మహత్య నేపథ్యంలో సంతాపకంగా జేపీఎస్‌లు శుక్రవారం జిల్లా కేంద్రంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
43.0 /28.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

20 వరకు సీసీఐ పత్తి కొనుగోళ్లు

ఆదిలాబాద్‌టౌన్: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ఈనెల 20 వరకు జిల్లాలోని ఆయా మార్కెట్ యార్డుల్లో పత్తి కొనుగోళ్లు ఉంటాయని జనరల్ మేనేజర్ మహేశ్వర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. ఎంఎస్పీతో కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. జూన్ మొదటి వారం నుంచి రుతుపవనాలు షురూ అయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో పత్తి సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు.

కేజీబీవీ బదిలీలకు 37 దరఖాస్తులు

ఆదిలాబాద్‌టౌన్: కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బంది బదిలీ ప్రక్రియలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 37మంది ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీటిని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అధికారులు ఈనెల 15వరకు పరిశీలించనున్నారు. జాబితాను సోమవారం ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నట్లు డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. 16న పాయింట్లతో కూడిన జాబితా విడుదల చేస్తారు. 17న అభ్యంతరాలు స్వీకరిస్తారు. 20న తుది జాబితా ప్రకటిస్తారు. 21 నుంచి వెబ్‌ఆప్షన్లు, 25న అలాట్‌మెంట్ పూర్తి చేస్తారు. బదిలీ అయిన వారికి 27 నుంచి 29 వరకు ఉత్తర్వులు అందజేసి ప్రక్రియ పూర్తి చేస్తారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ సెంటర్ ద్వారా ఐదు నెలల పాటు అందించే ఫౌండేషన్ ఉచిత శిక్షణకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ అధికారి సునీతకుమారి, స్టడీ సెంటర్ డైరెక్టర్ రమేశ్ ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భర్తీ చేయనున్న వివిధ ఉద్యోగాలకు సంబంధించి శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. శిక్షణ కాలంలో వసతితో పాటు స్టడీ మెటీరియల్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థుల ఎంపిక కోసం ఈ నెల 21న జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 94941 49416, 93987 84343 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జొన్న పంట కొనుగోళ్లకు ప్రభుత్వం ఆదేశాలు

ఆదిలాబాద్: యాసంగిలో పండిన జొన్న పంటకు మద్దతు ధర చెల్లించి సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు డీసీసీబీ డైరెక్టర్ బాలూరి గోవర్ధన్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు 2022–23 యాసంగిలో పండించిన పంటను కొనుగోలు చేసేందుకు ఉత్తర్వులు సైతం జారీ చేసిందని తెలిపారు. దీనిద్వారా ఉమ్మడి జిల్లాలోని ఆదిలాబాద్, కుమురంభీం, నిర్మల్ జిల్లాల పరిధిలో జొన్న పండించిన రైతులకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.


తునికాకు బోనస్ వెంటనే చెల్లించాలి



డీఎఫ్‌వోకు వినతిపత్రం అందజేస్తూ..

ఎదులాపురం: తునికాకు బోనస్ వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, రాష్ట్ర నాయకులు లంకా రాఘవులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఎఫ్‌వో రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 2013 నుంచి పెండింగ్‌లో ఉన్న తునికాకు బోనస్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ఇందులో టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమేశ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నర్సుల దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న స్టాఫ్ నర్సులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రిమ్స్ ఆస్పత్రిలో నర్సుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి మాట్లాడారు. నర్సులు సేవాభావంతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో హెడ్ నర్సులు సంధ్యారాణి, శోభారాణి, కమల, దేవకరణ, వేదనిక తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం.. ఆపై హడావుడి!

- నిధులు మంజూరైనా.. టెండర్లలో జాప్యం
- విద్యుత్‌శాఖ తీరుపై సర్వత్రా విమర్శలు
- 'సాక్షి' కథనంపై అదనపు కలెక్టర్ ఆరా
- త్వరగా పూర్తి చేయాలని ఆదేశం
- వర్షాకాలం ముందు పనుల పూర్తిపై అనుమానాలు



నార్నూర్ మండలం మాన్కపూర్ వ్యవసాయ భూమిలో బోర్‌వెల్

సాక్షి,ఆదిలాబాద్: చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా మారింది విద్యుత్ శాఖ అధికారుల తీరు. ఎస్సీ, ఎస్టీల వ్యవసాయ భూములకు ఏజీఎల్ బోర్‌వెల్ కనెక్షన్లకు సంబంధించి నిధులు మార్చి చివరలో మంజూరయ్యాయి. అయితే టెండర్ల నిర్వహణలో ప్రణాళిక లోపంతో ఇప్పటికీ సరైన రీతిలో పనులు అప్పగించలేని పరిస్థితి. దీంతో ఈ పనులు వర్షాకాలంకు ముందే పూర్తయితాయా.. లేదా అనేది సందిగ్ధంగా మారింది. ఈ క్రమంలో 'పైసలిచ్చినోళ్లకే పనులు..!' విద్యుత్ శాఖలో వసూళ్ల పర్వంపై శుక్రవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం స్పందించింది. అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ విద్యుత్ శాఖ ఎస్‌ఈతో మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లో పనులను వర్షాకాలంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. టెండర్లను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

అంతులేని జాప్యం..

ఏజీఎల్ బోర్‌వెల్ కనెక్షన్లకు సంబంధించి సుమారు రూ.40లక్షల విలువైన 473 పనులు నిర్వహించాలని డీఆర్డీవో, ఎస్సీ కార్పొరేషన్ నుంచి గత మార్చిలోనే విద్యుత్ శాఖకు ప్రతిపాదనలు పంపారు. వీటిని మొదట వరంగల్ సీఎండీ కార్యాలయానికి ఇక్కడి విద్యుత్ శాఖ అధికారులు పంపించారు. ప్రధానంగా అక్కడి నుంచే టెండర్లు నిర్వహించి ఈ పనులు త్వరితగతిన చేపట్టాలని మొదట్లో భావించారు. అయితే అప్పటికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. ఆ నెల చివరన నిధులు రావడంతో ఇక్కడి సర్కిల్ కార్యాలయం అధికారుల ఆలోచనలో మార్పు వచ్చింది. ఆ పనులు ఇక్కడినుంచే టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్లకు అప్పగించడం ద్వారా చేపట్టాలని నిర్ణయించారు. అయితే సరైన ప్రణాళిక లేకపోవడంతో టెండర్ల నిర్వహణలో విఫలమయ్యారు. దీంతో మూడుసార్లు నిర్వహించినా పూర్తి చేయలేకపోయారు. ఆ తర్వాత కొన్ని పనులను పూర్తి చేసినా అనేక పనులకు సంబంధించి వివిధ సెక్షన్లలో మిగిలిపోవడంతో వాటిని నామినేషన్‌పై కాంట్రాక్టర్లకు అప్పగించాలని ప్రణాళిక రూపొందించారు. ఇక్కడే అవినీతికి తెర లేసిందని బాహాటంగానే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నామినేషన్‌పై పనుల అప్పగింతలో డబ్బులు ఇచ్చిన పలువురు కాంట్రాక్టర్లకే వర్క్ ఇచ్చారనే ఆరోపణలు వ్యక్తం కావడం, స్వయంగా ఆదిలాబాద్ డీఈ కార్యాలయంలో కాంట్రాక్టర్లు సదరు అధికారితో ఈ విషయంలో గురువారం గొడవకు దిగడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ వివాదం కారణంగానే పనుల పంపకాల్లో జరుగుతున్న తతంగం బయటకొచ్చింది.

బ్లాక్ లిస్ట్ కాంట్రాక్టర్లను దూరం పెట్టడంతోనే..

బ్లాక్ లిస్ట్‌లో ఉన్న కాంట్రాక్టర్లను దూరం పెట్టడంతోనే వివాదం సృష్టిస్తున్నారని విద్యుత్ శాఖ అధికారులు ఆరోపిస్తున్నారు. నామినేషన్ పనులను అర్హులైన అందరు కాంట్రాక్టర్లకు సమంగా పంచడం జరుగుతుందని పేర్కొంటున్నారు. డబ్బులు తీసుకొని పనులు అప్పగిస్తున్నారనే విషయం వాస్తవం కాదని చెబుతున్నారు. ప్రధానంగా వర్షాకాలంకు ముందే ఈ పనులను పూర్తి చేయాలని భావిస్తున్నట్లు వివరిస్తున్నారు.

పనులను విడగొట్టి చేపట్టాం



మొదట సీఎండీ కార్యాలయం నుంచి ఈ పనులను ఒకే ప్యాకేజీపై నిర్వహించాలని అక్కడికి పంపించాం. అయితే పనులు సకాలంలో పూర్తయితాయో.. లేదోననే ఉద్దేశంతో ఆ తర్వాతే ఇక్కడే టెండర్లు నిర్వహించి పనులను ఎక్కువ మంది కాంట్రాక్టర్లకు విడగొట్టి అప్పగించాం. తద్వారా త్వరితగతిన పూర్తి చేయాలని చూస్తున్నాం. జిల్లా పాలన యంత్రాంగం ఆదేశాల మేరకు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా చొరవ తీసుకుంటున్నాం.

–సంపత్ కుమార్, విద్యుత్ శాఖ, ఎస్ఈ,ఆదిలాబాద్

నిప్పుల కుంపటి



ఎండ తీవ్రత కారణంగా నిర్మానుష్యంగా మారిన జిల్లా కేంద్రంలోని రహదారి

- మండిపోతున్న ఎండలు
- రికార్డుస్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో జనం ఇక్కట్లు

ఆదిలాబాద్‌టౌన్: భానుడు నిప్పుల కుంపటిగా మారాడు. వారం క్రితం వరకు జిల్లాలో అకాల వర్షాలతో వాతావరణం చల్లబడగా, మళ్లీ నాలుగు రోజులుగా ఎండ తీవ్రత పెరిగింది. ఉదయం 9 దాటిందంటే బయటకు వెళ్లేందుకు జనం జంకుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరువవుతున్నాయి. జిల్లాలో శుక్రవారం భీంపూర్ మండలం అర్లి(టి)లో 44.3 డిగ్రీల సెంట్రిగేడ్ నమోదైంది. రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశాలు లేకపోలేదని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మధ్యాహ్న సమయంలో పట్టణంలోని ముఖ్య కూడళ్లు నిర్మానుష్యంగా మారాయి. అలాగే నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడే బస్టాండ్, రైల్వే స్టేషన్, ముఖ్యకూడళ్లు బోసిపోతున్నాయి. సాయంత్రం 6 దాటినా ఎండ వేడిమి తగ్గడం లేదు.

ఇళ్లకే పరిమితం..

ఎండ వేడిమి తాళలేక జనం ఇళ్లకే పరిమితం అవుతున్నారు. వారం క్రితం వరకు జిల్లాలో అకాల వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. వాటి ప్రభావంతో వాతావరణం చల్లబడింది. ప్రస్తుతం భానుడు మళ్లీ తన ప్రతాపం చూపుతుండడంతో ఎండలు దంచి కొడుతున్నాయి. దీంతో జనం కూలర్లు, ఏసీలకు అతుక్కుపోతున్నారు. వ్యాపారులు, ఇతర పనులకు వెళ్లేవారు శీతల పానియాలు, కొబ్బరి బోండాలు తాగుతూ ఉపశమనం పొందుతున్నారు. ఉపాధి, వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులు ఎండ తీవ్రతను తట్టుకోలేక పోతున్నారు.

గత ఆరు రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	కనిష్టం	గరిష్టం
7న	26.7	37.3
8న	25.2	37.0
9న	28.2	39.8
10న	26.2	40.0
11న	24.7	41.3
12న	20.7	44.3

ఎండలతో జర పదిలం..

జిల్లాలో ఎండ తీవ్రత రోజురోజుకు పెరిగిపోతోంది. ఈ క్రమంలో ఎండలో తిరిగే వారు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే వృద్ధులు, చిన్నారుల విషయంలో అప్రమత్తంగా ఉండాలంటున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్న సమయంలో అవసరముంటే తప్పా బయటకు వెళ్లకూడదు. వదులైన కాటన్ దుస్తులు ధరించాలి. రోజుకు కనీసం 5 లీటర్ల నీటిని తీసుకోవడం మంచిది. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు ఎక్కువ తాగాలి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ ఆడె విఠల్, రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్

క్రీడా సంబురాలకు వేళాయె



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు (ఫైల్)

- ఈనెల 15 నుంచి సీఎం కప్ పోటీలు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- సన్నద్ధమవుతున్న క్రీడాకారులు

ఆదిలాబాద్: ఇక పల్లె, పట్టణాల్లో క్రీడోత్సవాలు షురూ కానున్నాయి. సుదీర్ఘ విరామం అనంతరం ఆటల పోటీలతో క్రీడా మైదానాలు సందడిగా మారనున్నాయి. కరోనా అనంతరం పాఠశాలల్లో విద్యార్థులు, మైదానాల్లో క్రీడాకారులు పలు కారణాలతో క్రీడలకు దూరమయ్యారు. అలాగే క్రీడా సాధన, పోటీలు లేక ఎంతో మంది క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాలకే పరిమితమయ్యారు. దీనిని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా పోటీల నిర్వహణకు శ్రీకారం చుట్టాయి. సీఎం కప్– 2023 పేరిట మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు సమాయాత్తమవుతున్నాయి. వీటిని విజయవంతం చేసేలా జిల్లా స్థాయి అధికారులందరినీ ఒకే తాటిపైకి తీసుకువచ్చి పకడ్బందీగా చేపట్టేలా ఆదేశాలు సైతం జారీ అయ్యాయి.

క్రీడలకు ప్రాచుర్యం.. క్రీడాకారులకు ప్రోత్సాహం

సీఎం కప్ పోటీల నిర్వహణలో భాగంగా గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు క్రీడలకు ప్రాచుర్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందడుగు వేస్తున్నట్లు స్పష్టమవుతుంది. ఇందులో భాగంగానే మండల, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించాలని నిర్ణయించింది. విజేతలకు నగదు పురస్కారాలు సైతం అందజేయనున్నారు. వ్యక్తిగత క్రీడాంశాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం (స్వర్ణ పతకం) సాధించిన వారికి రూ.20వేలు, ద్వితీయ స్థానం(రజత పతకం) రూ.15వేలు, తృతీయ స్థానం (కాంస్య పతకం) సాధించిన వారికి రూ.10వేల నగదు బహుమతులు అందజేస్తారు. టీం ఈవెంట్‌లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ. 1లక్ష, ద్వితీయ బహుమతి రూ.75వేలు, తృతీయ బహుమతి రూ.50వేలు నగదుతోపాటు ట్రోఫీని బహూకరించనున్నారు.నగదు ప్రోత్సాహకంతో పాటు పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. భవిష్యత్తులో వారికిఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈనెల 15నుంచి 17వరకు మండలస్థాయిలో, 22 నుంచి 24వరకు జిల్లాస్థాయిలో నిర్వహించనున్నారు.

16 క్రీడాంశాల్లో ..

15 ఏళ్ల బాలబాలికల నుంచి 36 ఏళ్లలోపు పురుషులు, మహిళలు ఈ పోటీల్లో పాల్గొనడానికి అర్హులు. మండల స్థాయిలో బాల బాలికలు, మహిళలు, పురుషులకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు, బాలురు,పురుషులకు ఫుట్‌బాల్ పోటీలుంటాయి.జిల్లాస్థాయిలో బాలబాలికలు, మహిళలు, పురుషులకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్ పోటీలు, బాలురు, పురుషులకు ఫుట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇలా మండలస్థాయిలో 5, జిల్లాస్థాయిలో 11క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

పకడ్బందీ నిర్వహణకు ప్రత్యేక కమిటీలు..

ఈ పోటీల నిర్వహణకు గాను రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ పకడ్బందీ చర్యలు చేపట్టింది. మండల, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసింది. మండల స్థాయిలో ఈ కమిటీకి ఎంపీపీ చైర్మన్‌గా వ్యవహరించనుండగా ఎంపీడీవో కన్వీనర్‌గా జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎంఈవో, ఎస్సై, మున్సిపల్ కమిషనర్, వ్యాయామ ఉపాధ్యాయులు సభ్యులుగా ఉండనున్నారు. ఇక జిల్లాస్థాయిలో కమిటీకి కలెక్టర్ చైర్మన్ కాగా, ఎస్పీ వైస్‌చైర్మన్‌గా, అడిషనల్ కలెక్టర్ కోవైస్ చైర్మన్‌గా, కన్వీనర్‌గా డీవైఎస్‌వో, జెడ్పీ సీఈవో, డీఎంహెచ్ఓ, డీఈవో, గిరిజన సంక్షేమ శాఖ డీడీ, పరిశ్రమల శాఖ జీఎం, మున్సిపల్ కమిషనర్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, జిల్లా గిరిజన క్రీడల అధికారి, డీపీఆర్వో సభ్యులుగా వ్యవహరిస్తారు.

జిల్లాకు రాష్ట్రస్థాయి పతకాలు ఖాయం..

ఆదిలాబాద్ జిల్లాలో ఎంతోమంది ప్రతిభ గల క్రీడాకారులు ఉన్నారు. అలాంటివారిని ప్రోత్సహించేందుకు చీఫ్ మినిస్టర్స్ (సీఎం) కప్ 2023 పోటీలు దోహదం చేస్తాయి. ఎంతో నైపుణ్యం గల మన జిల్లా క్రీడాకారులు ఈ పోటీల్లో రాణిస్తే జిల్లాకు రాష్ట్రస్థాయి పతకాలు ఖాయం. ఈ దిశగా వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకులు దృష్టి సారించాలి.

– బాలూరి గోవర్ధన్ రెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు

తగ్గని జేపీఎస్‌లు

- 15 రోజులుగా సమ్మె
- సర్కారు డెడ్‌లైన్‌ను సైతం పట్టించుకోని కార్యదర్శులు
- క్రమబద్ధీకరించేంత వరకు కొనసాగిస్తామని స్పష్టం
- పంచాయతీ పాలనపై ప్రభావం
- ఫలితమివ్వని ఇన్‌చార్జీల నియామకం



జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న పంచాయతీ కార్యదర్శుల దీక్షలు

బోథ్: తమను రెగ్యులరైజ్ చేసేంతవరకు సమ్మె కొనసాగిస్తామని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తేల్చి చెబుతున్నారు. టీఎస్‌పీఎస్ ద్వారా నియామకం అయిన తమను నిబంధన ల మేరకు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమ్మె విరమించి విధుల్లో చేరాలని, లేకపోతే ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తామని ప్రభుత్వం హెచ్చరించింది. అయితే సర్కారు హెచ్చరికను సైతం పట్టించుకోకుండా జేపీఎస్‌లు ఆందోళన కొనసాగిస్తున్నారు. న్యాయపరంగానే ఎదుర్కొంటామని స్పష్టం చేస్తున్నారు. నోటిఫికేషన్ సమయంలో మూడేళ్ల ప్రొబిషనరీ పీరియడ్ ఉండగా, 2022లో జీవోనంబర్ 26తో ప్రభుత్వం మరో ఏడాది పొడిగించిందని చెబుతున్నారు. ఈ ఏప్రిల్ 11తో అది కూడా ముగిసినా ఎందుకు రెగ్యులరైజ్ చేయడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు.

జిల్లాలో పంచాయతీలు : 468
జూనియర్ పంచాయతీ కార్యదర్శులు : 287
ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు : 36
రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు : 145

సర్దుబాటుతో సమస్యలు తీరేనా..?

రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులకు మూడు నుంచి నాలుగు పంచాయతీలకు ఇన్‌చార్జీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆన్‌లైన్ విధానం కారణంగా ఏ రోజు పనుల వివరాలు ఆ రోజే నమోదు చేయాల్సి ఉంటుంది. దీంతో మూడు నుంచి నాలుగు పంచాయతీ పనులను ఒక్కరే చేయాల్సి వస్తుండటంతో వారికి భారంగా మారింది. పింఛన్లతో పాటు, ట్రేడ్ లైసెన్స్‌లు జారీ చేయడం, ఉపాధిహామీ మస్టర్లు, ఇళ్ల నిర్మాణాల అనుమతులు మందకొడిగా సాగుతున్నాయి.

పల్లె పాలనపై ప్రభావం..

జేపీఎస్‌లు, ఒప్పంద ప్రాతిపదికన పని చేసే పంచాయతీ కార్యదర్శులు (ఓపీఎస్‌లు) తమను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 28 నుంచి సమ్మెలోకి దిగారు. జిల్లాలో దాదాపు 70 శాతం కార్యదర్శులు సమ్మె బాట పట్టడంతో పల్లె పాలనపై ప్రభావం చూపుతోంది. 15 రోజులుగా పర్యవేక్షణ లేక గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ గాడితప్పింది. మరోవైపు చేసిన పనులకు సకాలంలో బిల్లులు అందక సర్పంచ్‌లు సైతం స్వచ్ఛత నిర్వహణపై ఆసక్తి చూపడం లేదు. ఇక బయటకు రాని, నడవలేని వృద్ధుల ఆసరా పింఛన్లను కార్యదర్శుల వేలిముద్రల ద్వారా పంపిణీ చేయాల్సి ఉంటుంది. జేపీఎస్‌ల సమ్మె కారణంగా ఈ పంపిణీ నిలిచిపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉపాధి హామీ పథకంలో కార్యదర్శుల పర్యవేక్షణలోనే హాజరు నమోదు ఉంటుంది. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో ఈ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే జేపీఎస్‌ల గైర్హాజరుతో అవకతవకలు జరిగే అవకాశం ఉంటుంది. ఇక జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాల మంజూరు, ఇంటి అనుమతులు నిలిచిపోయాయి. నర్సరీల్లో మొక్కల పెంపకంపై కూడా సమ్మె ప్రభావం కనిపిస్తుంది. మరోవైపు ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా రెగ్యులర్ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పజెప్పినా వారిపై పని భారం పెరగడంతో పూర్తిస్థాయిలో విధులు నిర్వర్తించలేని పరిస్థితి.

తప్పనిసరి పరిస్థితుల్లోనే సమ్మెలోకి..



తప్పనిసరి పరిస్థితిలోనే సమ్మె చేపట్టాం. మేము టీఎస్‌పీఎస్సీ ద్వారా ఎంపికయ్యాం. వాస్తవానికి ప్రభుత్వ ఉద్యోగానికి రెండేళ్ల ప్రొబిషనరీ పీరియడ్ మాత్రమే ఉంటుంది. కానీ జేపీఎస్‌లకు మూడేళ్ల ప్రొబిషనరీ పీరియడ్ నిబంధన పెట్టారు. 2022లో మరో సంవత్సరం పెంచారు. అయినా భవిష్యత్ మీద ఉన్న ఆశతో విధులు నిర్వహించాం. నాలుగేళ్లు పూర్తయినా ప్రభుత్వం ఇప్పటికీ రెగ్యులరైజ్ చేయడం లేదు. మా న్యాయమైన డిమాండ్ పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తాం.

– చంద్రశేఖర్, జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు

వేంకటేశ్వర ఆలయాభివృద్ధికి కృషి

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- బాలాజీ గుట్టపై ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నార్నూర్: మండల కేంద్రంలోని బాలాజీ గుట్టపై ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఎమ్మెల్సీ విఠల్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యేలు రాథోడ్ బాపూరావు, ఆత్రం సక్కుతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహదాతలు పవార్ విజయ మోబిలాల్ దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్‌సింగ్ తిలావత్, మాజీ ఎంపీ నగేశ్, ఏఐసీసీ సభ్యులు జాదవ్ నరేశ్, నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ శ్రీరాం, ఎంపీపీ ప్రభాకర్, సర్పంచ్ గజానంద్‌నాయక్, ఆలయ కమిటీ చైర్మన్ సుస్మిత విఠల్ రాథోడ్, పంచలోహ విగ్రహ దాత ఇంద్రజిత్, పీఏసీఎస్ చైర్మన్ సురేశ్, నిర్వాహకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సినిమా ప్రదర్శించాలి



థియేటర్ వద్ద రమాదేవి, నాయకులు

భైంసా: పట్టణంలోని కమల థియేటర్‌లో 'ద కేరళ స్టోరీ' సినిమా ప్రదర్శన ఎందుకు నిలిపివేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శుక్రవారం బీజేపీ నాయకులు కమల థియేటర్ వద్దకు చేరుకున్నారు. ఈ చిత్రాన్ని ప్రదర్శించకుండా నిబంధనలు ఎందుకు విధించారని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ శ్రీను, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఇక్కడ సినిమా ప్రదర్శనకు కలెక్టర్ అనుమతిలేదని అధికారులు బీజేపీ నాయకులకు తెలిపారు. ముందుగా థియేటర్‌లో ఈ సినిమా ప్రదర్శిస్తున్నామని తెలిపి మళ్లీ వెనక్కి తగ్గడం ఎందుకని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి ప్రశ్నించారు. యాజమాన్యం ఈ సినిమాను ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. పోలీసులు అక్కడ ఉన్న వారిని చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. కాగా, శుక్రవారం భైంసాలో థియేటర్ మూసి ఉంచారు.

దాడి ఘటనలో యువకులపై కేసు

ముధోల్: మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడిపై దాడి చేసిన ఘటనలో పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి కొలి గల్లీ, భట్టి గల్లీకి చెందిన యువకులు నయాబాదిలోని ఓ హోటల్‌కు చాయ్ తాగడానికి వెళ్లారు. అక్కడే ఉన్న నయాబాదికి చెందిన ఐదుగురు వ్యక్తులతో కుర్చీల విషయమై వీరికి వాగ్వాదం జరిగింది. ఈక్రమంలో నయాబాదికి చెందిన ఐదుగురు భీమేశ్ అనే యువకుడిపై దాడి చేశారు. దీంతో అతడికి గాయాలు కాగా చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. దాడి ఘటనపై నయాబాదికి చెందిన ఐదుగురు, ఇతరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దుప్పట్లు, నగదు ఇస్తున్న రాథోడ్ జనార్దన్

నార్నూర్: మండలంలోని నాగల్‌కొండ గ్రామానికి చెందిన షేక్ అంజుమ్ సలీంకు చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గురువారం రాత్రి దగ్ధమైంది. నిత్యావసరాలు, ఇతర సామగ్రి కాలిపోయి దాదాపు రూ.60 వేల నష్టం జరిగింది. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు వేర్వేరుగా శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జెడ్పీ చైర్మన్ రూ.5వేల నగదు, దుప్పట్లు అందజేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీపీ కనక మోతుబాయి, సర్పంచ్ జాదవ్ సునీతనారాయణ్, తహసీల్దార్ ఆర్కా మోతీరాం, ఆర్ఐ రాథోడ్ కవిత, మైనార్టీ నాయకులున్నారు.

ట్రిపుల్‌ఐటీ పిలుస్తోంది!

- ప్రవేశానికి త్వరలో నోటిఫికేషన్
- ఆరేళ్ల సాంకేతిక విద్యపై ఆసక్తి
- ఏటా వందలాది ఉద్యోగాలు
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



భైంసా: ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు ముగిసి ఫలితాలు కూడా వచ్చేశాయి. ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులంతా కోర్సుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ కాలేజీలో చదివించాలో.. ఏ కోర్సులు చేయించాలో.. అనే విషయంపై విద్యావేత్తల సలహాలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా విద్యార్థుల చదువులపైనే ప్రత్యేక చర్చ కొనసాగుతోంది. తెలంగాణలోనే ఏకైక విద్యాలయ ప్రాంగణాన్ని కలిగి ఉన్న బాసర ట్రిపుల్‌ఐటీపై విద్యార్థుల చూపుపడింది. పోషకులంతా తమ పిల్లలను ఇక్కడే చదివించాలని అనుకుంటున్నారు. 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించిన సీట్ల భర్తీపై ఇప్పటికే యూనివర్సిటీ అధికారులు ఉన్నతాధికారులతో చర్చిస్తున్నారు. త్వరలోనే ఇక్కడ 1,500 సీట్ల ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలకానుంది.

గ్రామీణ విద్యార్థులకు వరం

గ్రామీణ విద్యార్థులకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించే బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రవేశాలకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు పోటీపడుతుంటారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన పల్లె విద్యార్థులకు బాసర ట్రిపుల్‌ఐటీ సువర్ణ అవకాశంగా మారింది. ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుకు సంబంధించి బాసర ట్రిపుల్‌ఐటీలో ఏటా పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించి అందులో అర్హత ఉన్నవారిని ఎంపికచేసి సీట్లను కేటాయిస్తోంది. రెండేళ్లక్రితం విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి మొదటిసారిగా పాలిసెట్ అర్హతను జోడించి సీట్లు కేటాయించారు. అప్పట్లో కోవిడ్ నేపథ్యంలో పాఠశాలలు మూసి ఉండడంతో పదో తరగతి విద్యార్థులను పరీక్షలు లేకుండానే ఉత్తీర్ణులు చేశారు. అలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల సీట్ల కేటాయింపు ప్రక్రియలో పాలిసెట్ అర్హతను జోడించి సీట్లు కేటాయించారు. ఈ ఏడాది పాత విధానంలోనే సీట్లు భర్తీచేయనున్నారు.

అందుబాటులో 1,500 సీట్లు

బాసర ట్రిపుల్‌ఐటీలో 1,500 సీట్లు భర్తీ చేయనున్నారు. ట్రిపుల్‌ఐటీ అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి ఎంతమంది విద్యార్థులకు సీట్లు కేటాయించాలో అనే విషయంలో నివేదిక పంపారు. 2020–21 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం 32వేల మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. 2021–22లో 20,178 మంది, 2022–23లో 31,432 మంది దరఖాస్తు చేశారు.

విద్యా విధానం ఇలా..

ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్ ఆధారంగా ట్రిపుల్ ఐటీలో బోధన కొనసాగుతోంది. మొదటి రెండేళ్లు ఇంటర్ తత్సమాన పీయూసీ కోర్సును బోధిస్తారు. అనంతరం పీయూసీలో మెరిట్ ఆధారంగా మరో నాలుగేళ్ల ఇంజినీరింగ్ సీట్లను ఎంపిక చేసుకోవచ్చు. పీయూసీ అనంతరం మెరుగైన అవకాశాలు వస్తే విద్యార్థులు ఇక్కడి నుంచి బయటకు వెళ్లి చదువుకునే అవకాశం కూడా ఉంది. నాలుగేళ్ల బీటెక్‌లో సివిల్, కెమికల్, కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, ఈసీఈ, ఎంఎంఈ కోర్సులు అందిస్తున్నారు. మొదటి రెండేళ్ల పీయూసీలో సాధించిన మార్కుల ఆధారంగానే బీటెక్‌లో కోర్సులు కేటాయిస్తారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులకు బాసర ట్రిపుల్‌ఐటీ అధికారులు అన్ని వసతులు సమకూరుస్తారు. ల్యాప్‌టాప్, అందరికీ ఒకేరకమైన దుస్తులు, షూస్, స్పోర్ట్స్ డ్రెస్ అందిస్తారు. హాస్టల్, భోజన వసతి యూనివర్సిటీయే కల్పిస్తోంది. విద్యార్థుల కోసం శారీరక, మానసిక వికాసానికి ఆటలు, కళలు, వ్యాయామం, సాంస్కృతిక రంగాల్లో రాణించేందుకూ తరగతులు నిర్వహిస్తున్నారు. బాసర ట్రిపుల్‌ఐటీలో ప్రత్యేక వైద్యశాల, అధునాతనమైన ల్యాబ్స్, డిజిటల్ లైబ్రరీలు అందుబాటులో ఉన్నాయి.

త్వరలో నోటిఫికేషన్

బాసర ట్రిపుల్‌ఐటీలో చదివేందుకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఆసక్తి కనబరుస్తారు. త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తాం. ఆ తర్వాత ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తాం. ఏటా 30వేలకుపైగా దరఖాస్తులు వస్తున్నాయి. ఇక్కడ చదివేందుకు రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు పోటీపడుతున్నారు.

– సతీశ్‌కుమార్, ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్

ఆంక్షల సడలింపుపై పీసీసీఎఫ్‌ను కలిసిన ఎమ్మెల్యే

ఖానాపూర్: ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లోని రాష్ట్ర రహదారులపై వాహనాల రాకపోకలపై అటవీశాఖ విధించిన పలు ఆంక్షలను సడలించి ప్రజలకు రవాణా పరమైన ఇబ్బందులు తొలగించాలని పీసీసీఎఫ్ డోబ్రియాల్‌కు ఎమ్మెల్యే రేఖానాయక్ విన్నవించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అంబేద్కర్ సచివాలయంలో పీసీసీఎఫ్‌ను కలిశారు. కడెం, దస్తురాబాద్, ఉట్నూర్, జన్నారం మండలాల మీదుగా వెళ్లే రహదారులపై అటవీ రక్షణ కోసం తామంతా కట్టుబడి ఉన్నామన్నారు. 30 ఏళ్లుగా అటవీశాఖ విధించిన ఆంక్షలతో ఈ ప్రాంతం అభివృద్ధికి దూరమవుతోందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధితో పాటు రవాణా సదుపాయాన్ని దృష్టిలో ఉంచుకుని అటవీశాఖ చెక్‌పోస్టుల్లో రాత్రివేళ నిషేధాలు ఎత్తివేయాలన్నారు. అనంతరం జన్నారం మండలం మేదరి కులస్తుల కోసం జన్నారంలో వెదురు డిపో ఏర్పాటు చేయాలని కోరారు. జన్నారం నుంచి ఉట్నూర్ వరకు నాలుగు లేన్ల రహదారికి అటవీ అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ క్రిస్టీనాను కలిసి తండాలు, గూడేల్లో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. ఈ సందర్భంగా పలు రోడ్ల ప్రతిపాదనలు అందజేశారు.

పెంబి తండాలో ఎక్సైజ్ దాడులు

పెంబి: మండలంలోని పెంబితండా గ్రామంలో శుక్రవారం ఎక్సైజ్ ఎస్సై సంపత్ కృష్ణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 50లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. అనంతరం ఎక్సైజ్ ఎస్సై మాట్లాడుతూ.. అక్రమంగా గుడుంబా తయారు చేసినా, అమ్మినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

పేదింట్లో 'వెలుగు' నింపిన అధికారి



మీటర్ వద్ద సంతోషంగా గంగవ్వ

లక్ష్మణచాంద: ఓ పేద ఇంట్లో వెలుగులు నింపాడు ఓ మనసున్న విద్యుత్ అధికారి. వివరాలు.. శుక్రవారం మండలంలోని మునిపెల్లి గ్రామానికి వచ్చిన విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. ఈక్రమంలో పొలం పనుల్లో ఉన్న గంగవ్వను పలకరించారు. ఇంట్లో విద్యుత్ కనెక్షన్ ఉందా? అని అడిగారు. పేదరికంలో ఉన్న తన ఇంట్లో విద్యుత్ కనెక్షన్ లేదని తెలిపింది. వెంటనే చలించిన సీనియర్ లైన్‌మన్ వేణుగోపాల్‌రెడ్డి సొంతంగా రూ.4వేలు వెచ్చించి వెంటనే మీటర్ కోసం డీడీ చెల్లించారు. సర్వీస్ వైర్ కూడా కొనుగోలు చేసి గంగవ్వ ఇంటికి విద్యుత్ కనెక్షన్ ఇప్పించారు. తన ఇంట్లో వెలుగులు నింపిన వేణుగోపాల్‌రెడ్డి, ఏడీ రంగస్వామి, ఏఈ మహేశ్, సిబ్బందికి గంగవ్వ కృతజ్ఞతలు తెలిపింది. గ్రామస్తులు విద్యుత్ అధికారులను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ఇద్దరికి స్వల్ప గాయాలు



సృజన్ (ఫైల్)

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టీ) బెల్లూరి శివారు ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సృజన్ (18) మృతి చెందగా సిద్ధార్థ్, గణేశ్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఆదిలాబాద్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపిన వివరాల ప్రకారం. ఆదిలాబాద్ రూరల్ మండల శివారు ప్రాంతంలోని ఓ గార్డెన్స్‌లో శుక్రవారం జైనథ్ మండలం పూసాయి గ్రామానికి చెందిన వివాహ వేడుక జరుగుతోంది. మహారాష్ట్రలోని పాటన్‌కు చెందిన గణేశ్, పూసాయి గ్రామానికి చెందిన సృజన్, సిద్ధార్థ్ ద్విచక్ర వాహనంపై వివాహ వేడుకల్లో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. గణేశ్ వాహనం నడుపుతుండగా సృజన్ మధ్య సిద్ధార్థ్ వెనుక కూర్చున్నారు. గార్డెన్స్ సమీపానికి రాగానే ఆదిలాబాద్ వైపు నుంచి చాందా (టీ) వైపు వెళ్తున్న మ్యాక్స్ పికప్ వాహనం ఎదురుగా ఢీకొట్టింది. దీంతో సృజన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సిద్ధార్థ్, గణేశ్‌కు సల్పగాయాలయ్యాయి. స్థానికులు సృజన్‌ను చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు మ్యాక్స్ పికప్ వాహన డ్రైవర్ ఎస్‌కే అఫ్రోజ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గల్ఫ్ గోస.. ఏదీ.. భరోసా?



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తిపేరు రెంక రాజేశ్వర్. నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలంలోని కౌట్ల(బీ)కి చెందిన ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ పోషణ, ఉపాధి కోసం కొన్నినెలల క్రితం సౌదీకి వెళ్లాడు. అక్కడ భవన నిర్మాణ పనులు చేస్తుండగా నిచ్చెన పైనుంచి జారి పడడంతో కాలు విరిగింది. నడవలేని స్థితిలో స్వదేశానికి తిరిగి వచ్చాడు. యావత్మాల్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో చికిత్స కోసం అనేక డబ్బులు వెచ్చించాడు. ప్రస్తుతం ఉపాధిలేక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన చెందుతున్నాడు. ప్రభుత్వం ఆర్థిక చేయూత అందించాలని వేడుకుంటున్నాడు.

చేయూత కోసం... అధికారుల చెంతకు..



సోన్ మండల కేంద్రానికి చెందిన గాండ్ల రమణ పన్నెండేళ్ల పాటు ఒమన్ దేశానికి వెళ్లి ఇటీవలే స్వదేశానికి తిరిగివచ్చాడు. బీసీ వర్గానికి చెందిన తనకు స్వయం ఉపాధి కోసం రుణం అందించాలని ఇటీవల కలెక్టరేట్, డీఆర్డీవో కార్యాలయాల్లో అధికారులను వేడుకున్నాడు. రుణం మంజూరు కోసం కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చినా ఇప్పటికీ ఎలాంటి సహాయం అందలేదని వాపోతున్నాడు.

- కొనసాగుతున్న వలసలు
- జిల్లా నుంచి ఉపాధిబాట
- ఇక్కట్లపాలై తిరుగుముఖం
- బతుకుబాటలో వెతలెన్నో..!

నిర్మల్‌ఖిల్లా: ఉపాధి వేటలో ఉన్న ఊరిని, కన్న తల్లిదండ్రులు, భార్యాపిల్లల్ని వదిలేసి ఎంతోమంది యువకులు ఉపాధికోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్నారు. అక్కడ అనేక కష్టనష్టాలకోర్చి స్వదేశం తిరిగి వచ్చాక అనేక వెతలు అనుభవిస్తున్నారు. ప్రభుత్వం తరఫున తగిన ఉపాధి దొరకక, ఆర్థికసాయం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గల్ఫ్ బాధితుల అవస్థలకు ఈ కుటుంబాల పరిస్థితి అద్దం పడుతోంది. ఇదేమాదిరిగా జిల్లాలో వందల సంఖ్యలో గల్ఫ్ బాధిత కుటుంబాలు ఆర్థిక ఇక్కట్లతో సతమతమవుతున్నాయి. ఒక్కో కుటుంబానిది ఒక్కోగాథ. గతంలో ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో సారథులుగా వ్యవహరించిన నాయకులకు గల్ఫ్ బాధితుల కష్టనష్టాలు తెలుసునని, ప్రస్తుతం వారి నేతృత్వంలో రాష్ట్ర పాలన జరుగుతుండడంతో తమ జీవితాలు బాగుపడతాయని బాధిత కుటుంబాలు ఆశ పడుతున్నాయి. అయితే ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా గల్ఫ్ బాధిత కుటుంబాల సంక్షేమానికి సర్కారు సరైన చొరవ చూపకపోడంతో ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లా నుంచి అధికంగా వలసలు..

నిర్మల్ జిల్లా నుంచి సుమారు 50 వేలకు పైగా నిరుద్యోగులు వివిధ దేశాలకు ఉపాధి కోసం వెళ్లినట్లు గల్ఫ్ సంక్షేమ సంఘాలు పేర్కొంటున్నాయి. జిల్లా నుంచి గల్ఫ్‌కు వెళ్తున్న వ్యక్తులకు అవసరమైన ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో ఎక్కువ మంది కూలీలుగానే పనులు చేస్తున్నారు. సుమారు ముప్పాతిక శాతం మంది వివిధ సంస్థలు, ఇళ్లలో కూలీలుగా, నిర్మాణ రంగంలో పనులు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. నిరక్షరాస్యత, ఎడారి దేశాల్లో వ్యవహరించే తీరుపై ముందస్తు అవగాహన లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. విదేశాలకు వెళ్లడానికి పాస్‌పోర్టుకు దరఖాస్తు చేసుకున్నది మొదలు అడుగడుగునా మోసాలు జరుగుతున్నాయి. వీసా పొందడం, టిక్కెట్ కొనుగోలు, విదేశాలకు ప్రయాణం, అక్కడికి చేరుకున్నాక వివిధ సమస్యలతో వలస కార్మికులు సతమతమవుతున్నారు. పని ప్రదేశంలో ప్రమాదాలు, వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, అనారోగ్యాలతో మరణిస్తున్న వారిసంఖ్య అధికంగానే ఉంటోంది. అక్కడి వాతావరణం సరిపడకపోవడం, ఆహారం సరిగా లేకపోవడం, మానసిక ఒత్తిడితో గుండె, మెదడు సంబంధిత వ్యాధుల బారినపడి పలువురు మరణిస్తున్నారు. జిల్లాలోని ఏదోఒక పల్లెకు నెలలో కనీసం నాలుగైదు మృతదేహాలు గల్ఫ్ దేశాల నుంచి వస్తున్నాయి. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే దుబాయి బాధలుండవని నేతలు హామీ ఇచ్చినప్పటికీ బాధితులకు భరోసా విషయంలో కార్యాచరణ రూపొందించడం లేదు. ఎన్ఆర్ఐ పాలసీ తయారీ, విధి విధానాలు, ప్రత్యేక బడ్జెట్ కేటాయింపు తదితర అంశాలపై దృష్టి సారించకపోవడంతో లబ్ధి చేకూరడంలేదు.

ప్రధాన డిమాండ్లివే..

గల్ఫ్ బాధితుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ ప్రధానంగా ఉంది. ఇందులో భాగంగా గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించాలని కోరుతున్నారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, జీవిత, ప్రమాదబీమా, పెన్షన్‌తో కూడిన సమగ్రమైన సాంఘిక భద్రత పథకం అమలు చేయాలని డిమాండ్ ఉంది. గల్ఫ్ జైళ్లలో చిక్కుకున్న వారికి మెరుగైన న్యాయ సహాయం అందించడం, శిక్షపడ్డ ఖైదీలకు ఇప్పటికే ఒప్పందం చేసుకున్న దేశాల నుంచి ఖైదీల మార్పిడి చేయడం, కేంద్రం తరఫున వెంటనే హైదరాబాద్‌లో సౌదీ, యూఏఈ, కువైట్ కాన్సులేట్లు ఏర్పాటు చేయడం, గల్ఫ్‌లో మృతి చెందిన వారి కుటుంబానికి తక్షణ సాయంగా రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్న డిమాండ్ ఉంది. ప్రవాసీ భారతీయ బీమా యోజన కింద రూ.10 లక్షల విలువైన ప్రమాద బీమా పథకంలో సహజ మరణాన్ని చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రత్యేక గల్ఫ్‌బోర్డు ఏర్పాటు చేయాలి



వలస కార్మికుల సంక్షేమానికి అవసరమైన ప్రత్యేక చర్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే తీసుకోవాలి. ఇందులో భాగంగా కేరళ తరహా ప్రత్యేక గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేయాలి. ఏటా వార్షిక బడ్జెట్‌లో రూ.500 కోట్ల నిధులు కేటాయించాలి. గల్ఫ్ బాధితులను ఆదుకోవడానికి ప్రభుత్వం రూ.500 కోట్లు విడుదల చేయాలి. గల్ఫ్‌లో మరణించిన కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలి. గల్ఫ్‌లో రాష్ట్ర ప్రభుత్వం మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలి. తిరిగివచ్చిన కార్మికులకు ఉపాధికోసం ఆయా వ్యక్తుల నైపుణ్యాలనుబట్టి ప్రభుత్వాలు తగిన చేయూతనివ్వాలి.

– స్వదేశ్ పర్కిపండ్ల, రాష్ట్ర అధ్యక్షుడు, ప్రవాసీమిత్ర కార్మిక సంఘం, తెలంగాణ

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని ఖథ్‌గాం గ్రామానికి చెందిన మల్లేశ్ (40) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీకాంత్, మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేశ్ ఖథ్‌గాంలో డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఈక్రమంలోనే మద్యానికి అలవాటుపడ్డాడు. నిత్యం మద్యం సేవిస్తుండగా ఇంట్లో ఆర్థిక కష్టాలు ప్రారంభమయ్యాయి. భార్యాపిల్లలను పట్టించుకోకుండా చేతికి వచ్చిన డబ్బులన్నీ మద్యం కోసమే ఖర్చుచేసేవాడు. ఈక్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు చీరెతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

బేల: మండలంలోని వరూర్(పి) గ్రామానికి చెందిన రాథోడ్ జెతలాల్ (48) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాథోడ్ జెతలాల్ కొన్నాళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఉదయం మద్యం మైకంలో ఇంటి బాత్రూంలో గడ్డిమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగువారు అతడిని 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమారులున్నారు. రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు.


గులాబ్‌సింగ్‌తండాలో..

ఆదిలాబాద్‌టౌన్: బజార్‌హత్నూర్ మండలం గులాబ్‌సింగ్ తండాకు చెందిన తకాడ బజన్‌లాల్ (27) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ ఎస్సై ఊశన్న తెలిపిన వివరాల ప్రకారం.. బజన్‌లాల్‌కు 2020 మేలో అర్చనతో వివాహం జరిగింది. వీరికి కూతురు ఉండగా, రెండో సంతానం కోసం అర్చన జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చేరింది. విషయం తెలుసుకున్న బజన్‌లాల్ మధ్యాహ్నం 2 గంటలకు రిమ్స్ ఆస్పత్రికి వచ్చి తన కూతురును తీసుకెళ్తానని భార్యతో చెప్పగా ఆమె నిరాకరించింది. దీంతో ఆయన మనస్తాపానికి గురై బయటకు వెళ్లి పురుగుల మందు తాగాడు. అనంతరం రిమ్స్ ఎమర్జెన్సీ వార్డు ఎదుట పడిపోగా స్థానికులు గమనించి ఆస్పత్రిలోకి తీసుకువెళ్లగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. ఆయన తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుకు మహిళ..

సారంగపూర్: మండలంలోని ధని గ్రామానికి చెందిన అగ్గు పెద్ద లక్ష్మి (40) పాముకాటుతో మృతిచెందింది. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దలక్ష్మి శుక్రవారం తెల్లవారుజామున అలుకు చల్లేందుకు అవసరమైన పశువుల పేడకోసం పక్కింటికి వెళ్లింది. ఈక్రమంలో తన ఎడమకాలికి పాము కాటు వేసింది. విషయం తెలుసుకున్న ఆమె బంధువులు నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ లక్ష్మి మృతిచెందింది. మృతురాలి మామ భూమన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్ తెలిపారు. మృతురాలికి కుమారుడు, కూతురు ఉన్నారు.


రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాలుడి మృతి



ఆడెపు చరణ్ (ఫైల్)

నేరడిగొండ: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన ఆడెపు చరణ్ (15) అనే బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 29న చరణ్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. అతడిని నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. చరణ్ వడూర్ గ్రామంలోని పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. చరణ్ మృతిచెందడంతో అతడి కుటుంబీకులు రోధించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

చెరువులో పడి ఒకరు..



బక్కన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ వేణుగోపాలకృష్ణ

సారంగపూర్: మండలంలోని గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన తిప్పని బక్కన్న (50) చెరువులో పడి మృతి చెందాడు. ఎస్సై కృష్ణసాగర్, మృతుడి బంధువులు తెలిపిన వివరాల పకారం.. బక్కన్న ఈనెల 10న అతిగా మద్యం సేవించి రాత్రివేళ చేపల వేటకు వెళ్లాడు. ఎంతకూ తిరిగిరాకపోయేసరికి అతడి అక్క ఉడుత గంగవ్వ బంధువుల ఇళ్లకు వెళ్లి ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గ్రామానికి చెందిన సల్ల సతీశ్ తన పంట పొలానికి వెళ్తున్న క్రమంలో చెరువులో బక్కన్న మృతదేహం కనిపించింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండగా ఎస్సై కృష్ణసాగర్ నిర్మల్ ఏరియా ఆస్పత్రి ఆర్ఎంవో వేణుగోపాలకృష్ణకు సమాచారం అందించారు. ఆయన ఘటనా స్థలికి చేరుకుని పోస్టుమార్టం నిర్వహించారు. గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

కడెం: మండలంలోని పాత కొండుకూర్ గ్రామానికి చెందిన డాకురి సాయి (19) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈనెల 5న కొండుకూర్ గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి తీవ్రగాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

సేవ చేసే అవకాశమిచ్చిన సీఎంకు కృతజ్ఞతలు

ప్రధాన సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన సోమేశ్‌కుమార్



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారుగా మాజీ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ శుక్రవారం బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలోని ఆరో అంతస్తులో తనకు కేటాయించిన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సోమేశ్‌కుమార్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్రానికి సేవ చేసే అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సచివాలయంలోని అధికారులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీ కొత్త నిబంధనలపై అవగాహన సదస్సు

సాక్షి, హైదరాబాద్: పన్ను మినహాయింపు నిబంధనల్లో వచ్చిన మార్పులను పన్ను చెల్లింపుదారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు గమనించాలని న్యూఢిల్లీ చీఫ్ కమిషనర్ (మినహాయింపులు) రేణు జౌహ్రీ సూచించారు. ఆదాయపు పన్ను మినహాయింపులో కొత్త, సవరించిన నిబంధనలను వివరించడానికి, హైదరాబాద్ ఏసీగార్డ్స్‌లోని ఆదాయపు పన్ను టవర్స్‌లో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రేణు జౌహ్రీ మాట్లాడుతూ.. ఆదాయపు పన్నులో మినహాయింపు సెక్షన్లలో తెచ్చిన కొత్త నిబంధనలు, సవరణలను తెలిపారు. నాన్ ప్రాఫిటబుల్ ఆర్గనైజేషన్స్ (ఎన్‌పీఓ)ల నమోదులో ఏప్రిల్ 1 నుంచి కొత్త విధానం ప్రారంభమైందని, ఇప్పటికే ఉన్న ఎన్‌పీఓలు, కొత్త ఎన్‌పీఓలు ఏదైనా మినహాయింపును క్లెయిమ్ చేయడానికి కొత్త రిజిస్ట్రేషన్ విధానాన్ని అనుసరించాలని సూచించారు. కొత్త నిబంధనల ప్రకారం, నిర్దిష్ట ఉల్లంఘనలకు పాల్పడితే రిజిస్ట్రేషన్ రద్దు చేయబడుతుందని స్పష్టం చేశారు. మినహాయింపును క్లెయిమ్ చేయడానికి, ఆదాయ రిటర్న్‌ను దాఖలు చేయడం తప్పనిసరని, అవసరమైన ఆడిట్ నివేదికలు, ఇతర నివేదికలను సమయానుకూలంగా సమర్పించాలని వెల్లడించారు. కార్యక్రమంలో జేసీఐటీ (మినహాయింపులు) వి.కోటేశ్వరమ్మ, డీసీఐటీ (మినహాయింపులు) సుధా కొరివి, డీసీఐటీ (మినహాయింపులు) ధృవాష్ట, ఆదాయపు పన్ను అధికారులు, పన్ను బార్ అసోసియేషన్ సభ్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

అధ్యాపకుడు మధుసూదన్ రెడ్డిని తొలగించండి

ప్రభుత్వానికి ఇంటర్ బోర్డ్ కార్యదర్శి సిఫార్సు

సాక్షి, హైదరాబాద్: సస్పెండైన సరూర్‌నగర్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు పి.మధుసూదన్ రెడ్డిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని ప్రభుత్వానికి ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ సిఫార్సు చేశారు. మధుసూదన్ రెడ్డిపై అవినీతితో పాటు, బాధ్యతారాహిత్యం, విధుల్లో క్రమశిక్షణ రాహిత్యం, ఉద్యోగులను బెదిరించడం, మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆయనను విధుల నుంచి తొలగించడం సరైన నిర్ణయమని ప్రభుత్వ కార్యదర్శికి పంపిన ఫైల్‌లో నవీన్ మిత్తల్ పేర్కొన్నారు.

ఐసీఐడీ వేదికలో భాగస్వామి కండి

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ సాగులో నీటి ఎద్దడి నివారణ అనే థీమ్‌తో నవంబర్ 1 నుంచి 8వ తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ ఇరిగేషన్, డ్రైనేజీ కమిషన్ (ఐసీఐడీ) అంతర్జాతీయ కాంగ్రెస్‌లో భాగస్వామి కావాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఐసీఐడీ ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం ఈఎన్‌సీ మురళీధర్‌ను కలిసి సమావేశం వివరాలను తెలిపారు. 57 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత భారతదేశానికి ఈ అవకాశం వచ్చిందని, విశాఖ వేదిక కానుందని పేర్కొన్నారు.

కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు అధిక ఫీజుల వసూళ్లను అరికట్టేందుకు కొత్త ఫీజు నియంత్రణ చట్టం తీసుకురావాలని భారతీయ జనతా యువమోర్చా డిమాండ్ చేసింది. ఫీజు రెగ్యులేటరీ కమిటీలను బలోపేతం చేసి ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం రూపొందించిన నివేదికతో ప్రైవేట్ సంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్మోహన్‌కు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు భానుప్రకాష్ ఆధ్వర్యంలోని బృందం వినతి పత్రం సమర్పించింది.


కాలులేని భార్యను భుజంపై మోసుకొని..

వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్‌లేక రోగి అవస్థ • చికిత్సకు వచ్చి వెళ్లే క్రమంలో ఘటన • సోషల్ మీడియాలో వీడియో వైరల్

ఎంజీఎం: వరంగల్ ఎంజీఎంలో స్ట్రెచర్ అందుబాటులో లేక ఓ వృద్ధుడు తన భార్యను చికిత్స అనంతరం భుజాలపై మోసుకెళ్లిన ఘటన శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మాలోతు లక్ష్మికి నవంబర్‌లో కుడికాలి రక్తప్రసరణ ఆగిపోవడంతో వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి మోకాలు కింద నుంచి కాలును తొలగించారు. రోగిని 15 రోజులకోసారి డ్రెస్సింగ్ కోసం తీసుకురావాలని సూచించారు. ఈ క్రమంలో శుక్రవారం లక్ష్మిని ఆమె భర్త ఆస్పత్రికి తీసుకువచ్చాడు. అక్కడున్న సిబ్బంది 'పెద్ద సార్ లేరు.. రేపు రావాలని చెప్పారు. అయితే ఆ సమయంలో స్ట్రెచర్ అందుబాటులో లేకపోవడంతో భుజాలపై మోసుకుంటూ మండుతున్న ఎండలోనే బయటకు తీసుకెళ్లాడు. ఈ ఘటనపై ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్ స్పందించారు. డ్రెస్సింగ్ అనంతరం పేషెంట్ కేర్ సిబ్బంది రోగిని వీల్‌చైర్‌లో క్యాజువాలిటీ నుంచి బయటకు తీసుకొచ్చారని తెలిపారు. కాలిపర్ (కాలుకు అమర్చే లోహ పరికరం) సేవల కోసం వెళ్లగా శనివారం అందుబాటులో ఉంటుందని, అప్పుడు రావాలని సిబ్బంది చెప్పారన్నారు. దీంతో తిరిగి వెళ్లే క్రమంలో ఎండ తీవ్రత దృష్ట్యా భర్త తన భార్యను ఒక చెట్టు వద్దకు తీసుకెళ్లేందుకు భుజంపై ఎక్కించుకొని వెళ్తుండగా కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారన్నారు. ఇలాంటి ఘటనలతో ఆస్పత్రిని అభాసుపాలు చేయవద్దని కోరారు.

టుడేస్ గ్రాఫిక్

మీకో విషయం తెలుసా? ప్రతి నాలుగు నిమిషాలకు ఈ భూమ్మీద వెయ్యి మంది పుడతారట. అయితే, ఆ వెయ్యి మందిలో ఏ దేశంలో ఎంత మంది జన్మిస్తారు? అల్రెడీ జనాభాలో నంబర్ వన్‌గా ఉన్న మనం.. ఈ విషయంలోనూ మొదటి స్థానంలోనే ఉన్నాం. వచ్చే నాలుగు నిమిషాల్లో ఆ వెయ్యిమందిలో 172 మంది భారత్‌లోనే పుడతారట. మరి మిగతా దేశాల సంగతేంటో.. ఓసారి చూద్దామా..



అడవులు కేంద్రంగా ఉగ్రవాద శిక్షణ

- ఆయుధాలు సమీకరించింది మహ్మద్ సలీం
- అక్కడి బృందానికీ ఇతడి ద్వారానే శిక్షణ
- ఈ ఐదుగురి నుంచి విదేశాలకు ఫోన్ కాల్స్



నగరంలో అరెస్టు చేసిన ఐదుగురినీ భోపాల్ కోర్టులో హాజరుపరుస్తున్న ఏటీఎస్

సాక్షి, హైదరాబాద్: నగరంతో పాటు భోపాల్‌లో పట్టుబడిన 16 మంది ఉగ్రవాదులు సమీపంలో ఉన్న అటవీ ప్రాంతాల్లోనే శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. నగర శివార్లలో ఉన్న వికారాబాద్‌లోని అనంతగిరి అడవుల మాదిరిగానే భోపాల్ సరిహద్దుల్లోని రైసెన్ అడవిని ఎంచుకున్నట్లు ఏటీఎస్ అధికారులు నిర్ధారించారు. అక్కడ అరెస్టయిన 11 మందితో పాటు నగరంలో చిక్కిన ఐదుగురినీ ప్రస్తుతం ఏటీఎస్ తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తోంది. –భోపాల్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సయ్యద్ డానిష్ అలీ ఇంటిలో సూత్రధారి యాసిర్ ఖాన్ నిర్వహించిన సమావేశాలకు నగరం నుంచి సలీంతో పాటు అబ్దుల్ రెహ్మాన్, షేక్ జునైద్ కూడా హాజరయ్యారని ఏటీఎస్ చెప్తోంది. దానికి సంబంధించిన ఆధారాలు సైతం తమకు లభించినట్లు స్పష్టం చేస్తోంది. గోల్కొండలోని సలీం నివాసంలో ఎయిర్ పిస్టల్, పిల్లెట్స్, భోపాల్‌లోని యాసిర్ ఇంటి నుంచి నాటు తుపాకీ, తూటాలు సీజ్ చేశారు. ఈ నాటు తుపాకీ సేకరించింది, భోపాల్ మాడ్యుల్‌కు శిక్షణ ఇచ్చింది కూడా సలీం అని ఏటీఎస్ అనుమానిస్తోంది. ఆ కోణంలో అతడిని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది.

విదేశీ నంబర్లకు ఫోన్లపై ఆరా

నగర మాడ్యుల్‌కు చెందిన ఐదుగురు సభ్యుల ఫోన్ల నుంచి విదేశీ నెంబర్లకు ఫోన్లు వెళ్లినట్లు అనుమానిస్తున్న దర్యాప్తు అధికారులు వాటి వివరాలు ఆరా తీస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వీరికి విదేశాల్లో ఉన్న వారితో ఉన్న సంబంధాల పైనా దర్యాప్తు చేయనున్నారు. ఉగ్రవాద సాహిత్యాన్ని తన ల్యాప్‌టాప్ వినియోగించి సొంతంగా తయారు చేసిన సలీం అందులో అనేక అంశాలు చేర్చాడు. ఆన్‌లైన్‌లో ఉన్న విషయాలతో పాటు వివిధ పుస్తకాల్లోని అంశాలు క్రోడీకరించి రూపొందించిన ఇందులో జిహాద్, ముజాహిదీన్ అంటే ఏమిటి? తాము ఏం చేయాలి? అనే వివరాలతో పాటు ఉగ్రవాద చర్యల్లో పాల్గొంటూ చనిపోయిన వారి కుటుంబాలను ఎలా ఆదుకోవాలి? ఎలాంటి ఆయుధాలు సమీకరించుకోవాలి? క్యాడర్‌ను ఎలా రిక్రూట్ చేసుకోవాలి? తదితర వివరాలు పొందుపరిచాడు.

ఈ కేసులో సాక్షులుగా 'వారు'

సలీం, రెహ్మాన్ గతంలో మరికొందరిని ఆకర్షించారు. వీళ్లు కేవలం మతపరమైన కార్యక్రమాలు చేపడుతున్నారని భావించిన వాళ్లు కొన్ని సమావేశాలకు హాజరయ్యారు. అయితే కొన్నాళ్లకే వీరి వ్యవహారశైలి, కార్యకలాపాలు అనుమానాస్పదంగా భావించిన వారంతా దూరయమ్యారు. వీరిని గుర్తించి, ఈ కేసులో సాక్షులుగా మార్చాలని పోలీసులు భావిస్తున్నారు.

ముగ్గురి ఇళ్లకు సీసీ కెమెరాలు

నగరంలోని వివిధ ప్రాంతాల్లో చిక్కిన ఐదుగురి ఉగ్రవాదుల్లో ముగ్గురి ఇళ్లకు బయట సీసీ కెమెరాలు ఉన్నాయి. మంగళవారం ఉదయం ఏటీఎస్ అధికారులు, పోలీసులు దాడి చేయడానికి వచ్చారనే విషయం వీటిలో చూసి వాళ్లు గుర్తించారు. దీంతో ఉగ్రవాద సాహిత్యం దొరక్కుండా చేయడానికి ప్రయత్నాలు చేశారు.

ఈనెల 15 నుంచి సీఎం కప్

- పురుషులు, మహిళలకు వేర్వేరుగా క్రీడలు
- మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పోటీలు
- గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకేనన్న శాట్స్ చైర్మన్

గన్‌ఫౌండ్రీ: సీఎం కప్–2023 పేరిట ప్రభుత్వం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో క్రీడా సంబరాలను నిర్వహించనుంది, ఈనెల 15 నుంచి 31వరకు వివిధ క్రీడా పోటీలు జరగనున్నాయి.15 ఏళ్ల నుంచి 36 ఏళ్ల వయస్సుగల పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించే క్రీడలు, వాటి నిర్వహణ, అందులో ఎవరెవరు ఉండాలనే అంశాలను రాష్ట్ర క్రీడా ప్రాదిరాన సంస్థ (శాట్స్) విడుదల చేసింది.

నిర్వహించనున్న క్రీడలు.. : ఈనెల 15 నుంచి 17 వరకు మండల స్థాయిలో, 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. 28 నుంచి 31 వరకు రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. మండల స్థాయిలో మహిళలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్ పోటీలు ఉంటాయి. పురుషులకు వాలీబాల్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, ఈత పోటీలు నిర్వహించనున్నారు. క్రీడల నిర్వహణకు మండల స్థాయికి రూ.15 వేలు, జిల్లా స్థాయికి రూ.75 ఇవ్వనున్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ఔత్సాహికుల నుంచి నిధులను సమకూర్చుకోవచ్చు.

నగదు ప్రోత్సాహకాలు..

రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు అందజేస్తారు. వ్యక్తిగత క్రీడల్లో బహుమతిగా ప్రథమ–రూ.20 వేలు, ద్వితీయ–రూ.15 వేలు, తృతీయ–రూ.10 వేల నగదు అందజేయనున్నారు. క్రీడా పోటీల్లో పాల్గొన్నవారికి ప్రశంసా పత్రాలనూ అందజేస్తారు. క్రీడల్లో పాల్గొనాలనుకునేవారు కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీల్లో పేర్లు నమోదు చేసుకోవాలి. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఈ క్రీడలు నిర్వహిస్తున్నట్లు శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ అన్నారు.

బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా!

- తాళి కట్టేందుకు మొండికేసిన వరుడు
- బైక్‌కు డబ్బులిచ్చి.. పెళ్లికి ఒప్పించిన ఎమ్మెల్యే రసమయి
- కరీంనగర్ జిల్లాలో ఘటన



శంకరపట్నం(మానకొండూర్): పెళ్లికూతురు మెడలో తాళి కట్టే సమయానికి బండి కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు మొండికేయడంతో అతిథిగా వెళ్లిన ఎమ్మెల్యే తానుబండి కొనిస్తా అని డబ్బులు ఇచ్చి వివాహంజరిపించిన ఘటన కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్‌లో చోటుచేసుకుంది. శంకరపట్నం మండలం అంబాల్‌పూర్ మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ, మాజీ ఉపసర్పంచ్ మల్లయ్య కూతురు అనూష వివాహం సైదాపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన సంఘాల వినయ్‌తో కుదిరింది. రూ.5 లక్షల కట్నంతో పాటు మోటార్ సైకిల్ కొనిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. కట్నం డబ్బులు ముట్టచెప్పారు. మొలంగూర్ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం పెళ్లి మండపానికి వధువు, వరుడి బంధువులు చేరుకున్నారు. కొత్తజంటను ఆశీర్వదించేందుకు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కూడా హాజరయ్యారు. తీరా.. తాళికట్టే సమయంలో మోటార్ సైకిల్ కొనిస్తేనే పెళ్లి చేసుకుంటా.. అని వరుడు వినయ్ మొండికేశాడు. దీంతో వరుడు, వధువు బంధువులు గొడవకు దిగడంతో ఎమ్మెల్యే రసమయి జోక్యం చేసుకుని పెళ్లి కొడుకు వినయ్‌తో మాట్లాడి మోటార్ సైకిల్ కొనుక్కోమని సొంత డబ్బులను (సుమారు రూ.50వేలు) అప్పటికప్పుడే పందిట్లోనే అందించారు. మిగతా సొమ్ము కూడా తానే ఇస్తానని హామీ ఇచ్చారు. అనంతరం దగ్గరుండి వివాహం జరిపించి నూతన జంటను ఆశీర్వదించారు. తోడబుట్టిన అన్నగా పెళ్లి మండపంలో పరువు కాపాడావని మాజీ సర్పంచ్ గాజుల లచ్చమ్మ కన్నీరు పెట్టుకుంది.

అజ్ఞాతానికి తెర

- 2004లో మావోయిస్టు దళంలోకి జ్యోతక్క
- కరీంనగర్ పోలీసు కమిషనర్ ఎదుట లొంగుబాటు



శివంగాలపల్లి గ్రామం

కోనరావుపేట(వేములవాడ): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల జ్యోతి అలియాస్ జ్యోతక్క లొంగిపోవడంతో 20 సంవత్సరాల అజ్ఞాతానికి తెర పడినట్లయింది.

మావోయిస్ట్ జ్యోతి నేపథ్యం..

కోనరావుపేట మండలం శివంగాలపల్లికి చెందిన నేరెళ్ల నర్సయ్య– భూదవ్వకు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. చిన్న కూతురు జ్యోతి ఐదో తరగతి వరకు స్థానిక పాఠశాలలో, 6–10 వరకు కోనరావుపేట ఉన్నత పాఠశాలలో, ఇంటర్ సిరిసిల్ల ప్రభుత్వ కళాశాలలో చదివింది. 2004లో శివంగాలపల్లిలో అప్పటి దళ కమాండర్ పద్మక్క గ్రామంలో సమావేశం నిర్వహించగా, ఆమె మాటలు విని జ్యోతి ఉద్యమం పట్ల ఆకర్షితురాలైంది. కళాశాలలో చదువుతుండగానే సీవో రఘు ఆధ్వర్యంలో మావోయిస్టులో చేరి అజ్ఞాతంలోకి వెళ్లింది.

20 ఏళ్లలో వివిధ హోదాలు

మావోయిస్టులో చేరిన జ్యోతక్క మొదట మదిమల్ల ఎల్‌జీఎస్ దళ సభ్యురాలిగా ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట, చందుర్తి, కథలాపూర్, నిజామాబాద్ జిల్లా సిరికొండ, భీంగల్ ప్రాంతాల్లో పనిచేసింది. 2011లో కర్రిగుట్ట(ఆదిలాబాద్ జిల్లా)లో జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత ఒడిశా రాష్ట్రానికి వెళ్లింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రెస్ ఇన్‌చార్జిగా పనిచేస్తోంది. పార్టీలో ఉండగానే దినేశ్ అలియాస్ ఎర్రగొల్ల రవిని పెళ్లి చేసుకుంది. అతడి వేధింపులు భరించలేక విడిపోయి ఇన్నాళ్లు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ హోదాల్లో పనిచేసింది.

ఎక్కడ ఎన్‌కౌంటర్ జరిగినా అలజడే..

ఏ రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ జరిగినా శివంగాలపల్లిలో అలజడి నెలకొనేది. మృతి చెందింది మహిళా నక్సలైట్ అయితే చాలు తమ జ్యోతే కావొచ్చని తల్లిదండ్రులు ఆందోళన చెందేవారు. పోలీసులు పలుమార్లు కుటుంబసభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి జ్యోతి లొంగిపోవాలని కోరారు. తండ్రి నర్సయ్య, సోదరుడు మల్లయ్య మృతి చెందగా మరో సోదరుడు ఆటో నడుపుకుంటూ సాధారణ జీవితం గడుపుతున్నాడు. ఎప్పటికైనా తమ కూతురు రాకపోతుందా అని ఎదురుచూస్తున్న వారి కోరిక ఇన్నాళ్లకు నెరవేరడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇన్విజిలేషన్‌కు వెళ్లలేదు..

- మళ్లీ విధుల్లో చేరారు..
- ఇది ఉపాధ్యాయుల తీరు


జగిత్యాల: జిల్లాలో గత మార్చి 15 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు ఇంటర్ పరీక్షలు నిర్వహించిన విషయం విదితమే. సారంగాపూర్ మండలంలోని పది మంది ఉపాధ్యాయులకు ఈ పరీక్షలకు ఇన్విజిలేషన్ విధులు అప్పగించారు. వారు మార్చి 14న మధ్యాహ్నం 2 గంటల వరకు రిలీవ్ అయి తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాల్లో రిపోర్టు చేశారు. ఇక్కడివరకు బాగానే ఉన్నా కొందరు ఉపాధ్యాయులు పరీక్ష కేంద్రాల్లో పర్యవేక్షణకు వెళ్లలేదు. అటు పాఠశాలలకు వెళ్లకుండా, ఇటు పరీక్ష కేంద్రాలకు హాజరు కాకుండానే 15 రోజులు ఎక్కడో గడిపారు. అయితే, మళ్లీ పాఠశాలలో చేరేందుకు హెడ్‌మాస్టర్లు అయితే, ఎంఈవో, ఉపాధ్యాయులైతే హెడ్‌మాస్టర్‌కు రిపోర్టు చేయాలి. ఇందుకోసం తాము ఇంటర్ పరీక్షలకు పర్యవేక్షకులు విధులు నిర్వర్తించినట్లు డ్యూటీ సర్టిఫికెట్లు సమర్పించాలి. కానీ, ఎంఈఓతోపాటు హెడమాస్టర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే విధుల్లో చేరినట్లు తెలిసింది. సుమారు 15రోజుల పాటు ఇన్విజిలేషన్‌కు వెళ్లకుండా, అంటు పాఠశాలలకు హాజరు కాకుండా నిబంధనలు అతిక్రమించిన డుమ్మా టీచర్లు, హెడ్‌మాస్టర్లు వేతనం పొందినట్లు తెలిసింది. ఒకరిద్దరు గైర్హాజరు కావడం, మరికొందరు అసలు పర్యవేక్షణ విధులకే వెళ్లకుండా మళ్లీ స్కూళ్లలో చేరి, వేతనం పొందినట్లు ప్రచారం జరుగుతోంది.

డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వలేదు

ఇంటర్మీడియెట్ పర్యవేక్షకులుగా వెళ్లిన కొద్దిమంది ఉపాధ్యాయులు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వలేదు. ఈనెల 15లోపు అందజేస్తామని వారు తెలిపారు. ఒకవేళ వారు ఇన్విజిలేషన్ విధులకు హాజరు కాకపోతే చర్యలు తీసుకుంటాం.

– భీమయ్య, ఎంఈవో, సారంగాపూర్

రాజన్న సేవలో ఏడీసీ



దర్శనానికి వెళ్తున్న ట్రిబ్యునల్ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు

వేములవాడ: వేములవాడ రాజన్నను శుక్రవారం రాష్ట్ర దేవాదాయశాఖ ట్రిబ్యునల్ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఆయన వెంట పర్యవేక్షకులు శ్రీరాములు, అల్లి శంకర్, ఏఈఓ డి.శేఖర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ సంకెపల్లి పవన్, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

'మన బడి' భద్రతకు వాచ్‌మెన్



మన బస్తీ–మనబడిలో ఎంపికైన మంచిర్యాల న్యూ గర్ల్మిళ్ల పాఠశాల

మంచిర్యాలఅర్బన్: వేసవి సెలవుల్లో పాఠశాలల రక్షణకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. దశలవారీగా పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, సమగ్ర అభివృద్ధి, పటిష్టత కోసం గ్రామీణ ప్రాంతాల్లో మన ఊరు–మన బడి, పట్టణ ప్రాంతాల్లో మన బస్తీ–మన బడి కార్యక్రమం కింద పనులు చేపట్టింది. ఇప్పటికే కొన్ని పాఠశాలలు అన్ని హంగులతో తీర్చిదిద్దారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్ సిస్టం, తాగునీరు, సోలార్ పీవీ సిస్టమ్స్, భోజనశాల ఫర్నిచర్, ఐఎఫ్‌పీఎస్, డ్యూయల్ డెస్కులు, పాఠశాలలకు పెయింటింగ్, గ్రీన్‌చాక్ బోర్డులు వంటి సౌకర్యాలు సమకూర్చారు. పనులు పూర్తి చేసిన ప్రతీ పాఠశాలలో పగలు, రాత్రి కాపలాదారుని నియమించాలని పాఠశాల విద్య డైరెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే వరకు తాత్కాలిక పద్ధతిన వాచ్‌మెన్‌ల నియామకం చేపట్టాలని సూచించారు.

నియామకం.. విధులు ఇలా..

పాఠశాల నిర్వహణ కమిటీ ద్వారా డే, నైట్ వాచ్‌మెన్ ఏర్పాటు చేయాల్సి ఉంది. వాచ్‌మెన్‌ను నియమించే సమయంలో గత పనితీరు, పూర్వాపరాల ఆధారంగా కాపలాదారున్ని తాత్కాలిక పద్ధతిన విధుల్లోకి తీసుకోవాలి. స్థానికుడై ఉండడంతోపాటు 60 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలనే నిబంధనలున్నాయి. నెలకు రూ.5వేలు గౌరవ వేతనాన్ని ఎంఈవోఎంటీ, ఎంటీఎంటీ అడ్మినిస్ట్రేటివ్ ఖర్చు నుంచి చెల్లిస్తారు.

బాధ్యతలు..

కాపలాదారు పగలు, రాత్రి పాఠశాలల భద్రత చేపట్టాల్సి ఉంటుంది. ఏఎఫ్‌పీల ఇన్‌స్టాలేషన్, బ్యాటీర్ ఆఫ్ ట్యాప్స్, డ్యూయల్ డెస్కులు, డ్రికింగ్, సోలార్ ప్యానల్‌లతోపాటు మొక్కలకు నీరు పెట్టాలని సూచించారు. పాఠశాల ఆవరణలో క్రమం తప్పకుండా చూడడం, వార్డు విధులు, అనధికార వ్యక్తులు పాఠశాలలోకి ప్రవేశించకుండా చూడాల్సి ఉంటుంది. తాత్కాలిక పద్ధతిన నియమించే వాచ్‌మెన్‌కు గౌరవ వేతనాన్ని విడుదల చేసేందుకు నెలవారీ హాజరు అందించాలని ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

జిల్లాల వారీగా..

జిల్లా	పాఠశాల సంఖ్య
ఆదిలాబాద్	32
కుమురంభీం	65
నిర్మల్	88
మంచిర్యాల	85

బొమ్మలకు శుభమంగళం

- చిన్నారులే పెండ్లి పెద్దలుగా..
- కుమురంభీం జిల్లా తాటిపల్లిలో అట్టహాసంగా బొమ్మల పెళ్లి



తాటిపల్లిలో బొమ్మల పెళ్ల జరిపిస్తున్న చిన్నారులు

కౌటాల(సిర్పూర్): పెళ్లికూతురు అందంగా ముస్తాబైంది. పెళ్లి కుమారుడు మండపంలో కూర్చొని సిద్ధంగా ఉన్నాడు. చిన్నపిల్లలు తోడుగా రాగా.. వధువు సిగ్గుపడుతూ మండపానికి విచ్చేసింది. చిన్నారులే పెండ్లి పెద్దలుగా వ్యవహరించి వేదమంత్రాలతో కల్యాణం జరిపించారు. వధువు, వరుడు వివాహ బంధంతో ఒక్కటయ్యారు. కుమురంభీం జిల్లా కౌటాల మండలం తాటిపల్లిలో గురువారం రాత్రి నిర్వహించిన బొమ్మల పెళ్లిలో కనిపించిన చూడముచ్చటైన దృశ్యమిది. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో ప్రజలు మరాఠా సంప్రదాయాలు పాటిస్తారు. ఏటా సంప్రదాయాలు, వివాహ బంధం, కుటుంబ విలువలపై పిల్లలకు అవగాహన కల్పించేందుకు బొమ్మల పెళ్లిళ్ల నిర్వహిస్తారు. వేసవిలో విద్యాసంస్థలకు సెలవులు రావడం, మంచి ముహూర్తాలు ఉండడంతో తాటిపల్లిలోని హనుమాన్ ఆలయంలో గ్రామానికి చెందిన చిన్నారులు వధువు, వరుడు బొమ్మలను అందంగా అలంకరించి వివాహం జరిపించారు. సంప్రదాయం ప్రకారం గణపతి గజముఖం, మంగళాష్టకాలులను చదువుతూ.. శుభ మంగళ సావధాన్ మంత్రం పఠిస్తూ పెళ్లి తంతు పూర్తి చేశారు. ఈ వేడుక నిర్వహణకు చిన్నారులే నగదు జమ చేసుకుని ఖర్చు భరించడం విశేషం. వివాహం అనంతరం విందు సైతం ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా ఇంజినీరింగ్ ఎంసెట్



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్: ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం ఎంసెట్ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు ప్రభుత్వం పకడ్బందీగా పరీక్షను నిర్వహిస్తోంది. ఈ నెల 12వ తేదీనాటి పరీక్ష ఉమ్మడి జిల్లాలోని వాగేశ్వరి అయాన్ డిజిటల్ జోన్, వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల, జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల, శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో 2 కేంద్రాలు, కరీంనగర్‌లోని వివేకానంద, అల్ఫోర్స్, హుజూరాబాద్‌లోని కిట్స్ కళాశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు. రెండు సెషన్లలో ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి 6 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. గంటన్నర ముందే పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఇచ్చారు. విద్యార్థుల హాల్ టికెట్ బార్ కోడింగ్ ద్వారా పరీక్షించి కేంద్రంలోకి అనమతిచ్చారు. జ్యోతిష్మతిలో 80 మంది విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం 78మంది హాజరయ్యారు. వాగేశ్వరి అయాన్ డిజిటల్ సెంటర్లో 722 మంది విద్యార్థులకు ఉదయం 696మంది, మధ్యాహ్నం 701మంది హాజరయ్యారు. వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో 110మంది విద్యార్థులకు ఉదయం 107 మంది, మధ్యాహ్నం 108మంది హాజరయ్యారు. శ్రీ చైతన్య 1 కళాశాలలో ఉదయం 80మందికి 79మంది హాజరుకాగా, మధ్యాహ్నం 80మంది హాజరయ్యారు. శ్రీ చైతన్య–2లో ఉదయం 200 మంది విద్యార్థులకు 196మంది, మధ్యాహ్నం 195మందికి హాజరయ్యారు. అల్ఫోర్స్‌లో 55మందికి ఉదయం 52మంది, మధ్యాహ్నం 55మంది హాజరయ్యారు. హుజూరాబాద్ కిట్స్ కళాశాలలో ఉదయం 90మందికి 88మంది హాజరుకాగా, మధ్యాహ్నం 86మంది హాజరయ్యారు. వివేకానందలో 105మందికి ఉదయం 104మంది, మధ్యాహ్నం 103 హాజరయ్యారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్ఐ ప్రమోద్ రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిర్మానుష్యంగా.. సుంకిడి



నిర్మానుష్యంగా మారిన గ్రామం



పోలీసుల బందోబస్తు

తలమడుగు: నిత్యం స్థానికులతో రద్దీగా ఉండే సుంకిడి గ్రామం శుక్రవారం నిర్మానుష్యంగా మారింది. గ్రామస్తులంతా ఐదేళ్లకోసారి చాందా గ్రామంలోని శ్రీ మహాలక్ష్మిదేవి అమ్మవారి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఉదయాన్నే వీరంతా అక్కడికి వెళ్లారు. పూజల అనంతరం అక్కడే వండుకొని భోజనా లు చేశారు. రాత్రి ఇళ్లకు చేరుకున్నారు. కాగా, ఊరంతా ఖాళీ కావడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామస్తులతో కలిసి ఎ మ్మెల్యే రాథోడ్ బాపూరావు, మాజీ ఎంపీ నగేశ్ స ర్పంచ్, మహేందర్ తదితరులు వెళ్లారు.